క్లుప్తంగా

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ సందర్శన



ప్రాసెసింగ్ యూనిట్ వద్ద హైస్కూలు విద్యార్థులు

కాళ్ల: కలవపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా ఆక్వా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ని సందర్శించారని ప్రధానోపాధ్యాయుడు సీతారామమూర్తి తెలిపారు. 9, 10వ తరగతుల విద్యార్థులు కాళ్ల మండలం ఏలూరుపాడు పరిధిలోని రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించారన్నారు. రొయ్యల ప్రాసెసింగ్ విధానం, -180 ఉష్ణోగ్రతలో భద్రపరచడం, ప్యాకింగ్, తదుపరి వాటిని అంతర్జాతీయ మార్కెటింగ్‌కు తరలించే విషయాలను విద్యార్థులకు వివరించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం బాండ్ అందజేస్తున్న అధికారులు

కాళ్ల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శాశ్వత అన్నదాన పథకానికి కాళ్ల గ్రామస్తుడు గోళ్ళ నాగేశ్వరరావు, పద్మ దంపతులు కుమారుడు జగదీష్, పుష్ప కుటుంబ సభ్యులు రూ.1,00,000 విరాళాన్ని అందజేశారు. శనివారం దాత నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ ఆలయ అధికారులకు కుటుంబ సభ్యులతో కలిసి చెక్కును అందించినట్లు తెలిపారు. తమ కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి బాండ్ పత్రాన్ని అందించారని తెలిపారు.

భీమవరం - అమలాపురం ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్ ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం - అమలాపురం ఆర్టీసీ నూతన ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శనివారం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అమలాపురం రూట్ బస్సు సర్వీస్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి ఆఫీస్ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

భీమవరం: స్థానిక 12వ వార్డు వైఎస్సార్ కాలనీలో కమ్యూనిటీ హాల్ వెంటనే నిర్మించాలని టౌన్‌షిప్ మూడో శాఖ డిమాండ్ చేసింది. స్థానిక టౌన్‌షిప్‌లో మూడో శాఖ మహాసభ తణుకు ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం టౌన్ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ వైఎస్సార్ కాలనీ ఏర్పడి 15 సంవత్సరాలు దాటినా కమ్యూనిటీ హాలు నిర్మించలేదన్నారు. ఈ హాల్ రిజర్వ్ స్థలం వేరే వ్యక్తి చెరువు కింద వినియోగించుకొని లబ్ధి పొందుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. మహాసభలో ఎం వైకుంఠరావు, కె.శ్రీనివాసులు, కె.దుర్గ, తణుకు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ ముబాషీర్(39 అప్పుల పాలు కావడంతో ఈ నెల 14న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ముబాషీర్ నోటివెంట నురుగురావడాన్ని గమనించిన అతని భార్య షేక్ పర్వీన్ వైద్య చికిత్స నిమిత్తం భీమవరంలోని పలు ఆసుపత్రులకు తిప్పారు. మెరుగైన వైద్యం కోసం 15న కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ముబాషీర్ శనివారం తెల్లవారు జాము మృతి చెందాడు. మృతి భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ యేషయా కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత


విద్యార్థులకు సాయం అందిస్తున్న గెటప్ శ్రీను

ఆకివీడు: తనకు జన్మనిచ్చిన భూమిని, తనకు తోడుగా నిలిచిన ప్రజల్ని మరువకూడదని భావించి హాస్య నటుడు గెటప్ శ్రీను ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని కాళింగగూడెం గ్రామంలో శనివారం ఎంపీ యూపీ స్కూల్‌లోని 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ మంచి మార్కులు వచ్చిన విద్యార్థులు ఇద్దరు చొప్పున ఎంపిక చేసి వారికి రూ.3,4,5,6 వేలు చొప్పున అందజేశారు. మొత్తం రూ. 36 వేల ఆర్థిక సహాయాన్ని విద్యార్థులకు అందజేయడంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నీరు పేదలు

- కలుషిత నీటి సరఫరాతో ప్రజల గగ్గోలు
- సమీపంలో కొల్లేరు ఉన్నా గుక్కెడు నీటి కోసం అవస్థలు

మండలం	హేబిటేషన్లు	రక్షిత ట్యాంకులు
ఆకివీడు	37	24
ఉండి	44	34
కాళ్ల	37	22
పాలకోడేరు	40	22
మొత్తం	158	102

ఆకివీడు: చుట్టూ నీరు ఉన్నా ప్రజలకు తాగడానికి గుక్కెడు నీరు దొరకడం కష్టమవుతోంది. ఇది రాయలసీమలోని ఏ ప్రాంతమో కాదు.. కొల్లేరు సరస్సు తీరంలో ఉన్న ఉండి నియోజకవర్గంలోని పలు గ్రామాల పరిస్థితి. పంట కాలువల ద్వారా నీటి సరఫరా ఉన్నా ఆయా కాలువల్లో కలుషిత నీరు ప్రవహిస్తుంది. ఇదే నీటిని మంచినీటి చెరువుల్లో నింపుతున్నారు. మంచినీటి చెరువుల ద్వారా నీటిని తోడి ఫిల్టర్ బెడ్‌లలోకి నింపి ఫిల్టర్ చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఫిల్టర్ చేసే అవకాశం లేకపోవడంతో ప్రజలకు కుళాయిల ద్వారా నేరుగా రా వాటర్‌నే సరఫరా చేస్తున్నారు. నియోజకవర్గంలోని 72 గ్రామాల్లోని 158 శివారు ప్రాంతాలతో కలిపి మొత్తం 102 రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. ప్రతి రక్షిత మంచినీటి పథకానికీ ఫిల్టర్ బెడ్‌లు, సంపులు అందుబాటులో ఉన్నాయి. రక్షిత మంచినీటి పథకాల నుండి కుళాయి ద్వారా గ్రామ ప్రజలకు మంచినీరు సరఫరా చేస్తున్నారు. అయితే ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక మార్పిడి పెద్ద సమస్యగా మారింది. గ్రామ పరిపాలనాధికారులను ఇసుక సమస్య విసిగెత్తిస్తోంది. ఇసుక లభించక ప్రతి గ్రామంలో పాత ఇసుకతోనే ఫిల్టర్ చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. అధిక శాతం పంచాయతీలు, శివారు గ్రామాల్లోని రక్షిత నీటి పథకాల్లో రా వాటరే నేరుగా ఫిల్టర్లలో నింపి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. మంచినీరుగా వినియోగించాల్సిన కుళాయిల నీటిని వాడకానికి కూడా ఉపయోగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మురుగు కంపు, రంగు మారిపోవడం, దుర్వాసన, నాచు కంపుతో నీరు సరఫరా అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ప్రతీ ఆరు నెలలకో'సారీ'

రక్షిత మంచినీటి పథకాల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లలో ఇసుకను ప్రతీ ఆరు నెలలకొకసారి మార్పు చేయాల్సి ఉంది. ఇసుక శుభ్రంగా ఉంటేనే నీరు పరిశుభ్రంగా ఉంటుంది. ఫిల్టర్ అవుతుంది. ఆరు నెలలకోసారి మార్చాల్సిన ఇసుక సకాలంలో లభించకపోవడం, పంచాయతీలకు అనుమతులు ఇవ్వకపోవడం, నిధుల లేమితో ఇసుక మార్పిడి పెద్ద గండంగా మారింది. దీంతో ఆరునెలలకోసారి మార్పు చేయలేమని చెబుతున్నారు. ప్రస్తుత తరుణంలో ఇసుక ఇబ్బంది వర్ణనాతీతంగా ఉంది. దీంతో ఫిల్టర్లలోని ఇసుకను ఒకటికి రెండు, మూడు సార్లు కడిగించి, నాచు తొలగించి, బ్లీచింగ్, వంటివి చల్లించినా ఫలితం దక్కడం లేదు.

పంచాయతీలకు ఇసుక ఏదీ?

ఉచిత ఇసుక అంటూ ఆర్భాటంగా ప్రకటనలిస్తున్న ప్రభుత్వం పంచాయతీల్లోని ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక మార్పిడికి దొరకడంలేదని అధికారులు చేతులెత్తేశారు. దీంతో రా వాటరే ప్రజలకు గత్యంతరమైంది.


రా వాటర్‌తో కలుషితమైన ఫిల్టర్ బెడ్‌లోని నీరు


మండలంలోని నందమిల్లిపాడులో ఫిల్టర్‌లో పేరుకుపోయిన నాచును తొలగిస్తున్న దృశ్యం

ఫిల్టర్ అవ్వడం లేదు



పలు గ్రామాల్లోనూ, నగర పంచాయతీలోనూ కుళాయిల ద్వారా సరఫరా చేసే మంచినీరు అధ్వానంగా ఉంటుంది. ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక మార్పిడి విధానానికి ఇసుక లభించకపోవడం దారుణం. నాచు పట్టి నీచు కంపుతో కుళాయిల నీరు పలు గ్రామాల్లో వస్తుంది. ప్రజలకు గుక్కెడు మంచినీరందివ్వలేని దుస్థితిలో పాలకులున్నారు. ఇసుకను వెంటనే సరఫరా చేసి ప్రజలకు మంచినీరందివ్వాలి. -నందక సూరిబాబు, సీపీఎం నాయకులు, ఆకివీడు.

రా వాటరే గత్యంతరం



మా గ్రామంలో రా వాటరే కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. దీంతో ఫిల్టర్ బెడ్‌లలో నాచు పేరుకుపోయింది. మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాటర్ ప్లాంట్‌లకు ఎగబడాల్సి వస్తుంది. వాటర్ ప్లాంట్‌ల నీరు తాగితే కీళ్ల నొప్పులొస్తున్నాయని వృద్ధులు, మహిళలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో ఫిల్టర్ బెడ్‌లకు తగినంత ఇసుకను సరఫరా చేయాలి. – నంద్యాల కృష్ణ, మందపాడు, ఆకివీడు మండలం

ప్రతిపాదనలు చేశాం



అన్ని గ్రామ పంచాయతీల్లోని రక్షిత మంచినీటి పథకాల మరమ్మతులకు, ఇసుక మార్పిడి వంటి వాటికి ప్రతిపాదనలు చేసి ఆయా గ్రామ పంచాయతీలకు ఇచ్చాము. నిధుల వెసులుబాటును బట్టి ఆయా పంచాయతీలు తీర్మానం చేసుకుని పనులు మొదలు పెట్టాల్సి ఉంది. – ధనానంద్, ఇన్‌ఛార్జి డీఈఈ ఆర్‌డబ్ల్యూఎస్, భీమవరం

అష్టవాజపేయమ్ మహాయాగం బ్రోచర్ విడుదల


అష్టవాజపేయమ్ మహాయాగం బ్రోచర్ విడుదల చేసిన దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు పాలంగి రోడ్డులోని భమిడి సూరన్న లే అవుట్లో ఉమా రామలింగేశ్వర ట్రస్ట్ (నెలమూరు) ఆధ్వర్యంలో అష్టవాజపేయమ్ (శరద్వాజపేయమ్) మహాయాగం నిర్వహిస్తున్నట్టు యజ్ఞ కమిటీ భీమవరం సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, నడింపల్లి బంగార్రాజు తెలిపారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మహాయాగం బ్రోచర్‌ను వాడు విడుదల చేశారు. శ్రీచండీ, మహారుద్ర పూర్వక కోటి దీపోత్సవ, కోటి కుంకుమార్చన సహిత మహాయాగాన్ని నిర్వహించనున్నామని, ఇది 80వ యాగమాని, మే 15న భీమవరంలో 79వ అతిరాత్ర మహాయగాన్ని చేపట్టామని వివరించారు.

రైళ్లలో దొంగతనం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

భీమవరం: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రైల్వే ఎస్సై పీటీవీ రమణ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉడిమూడి గ్రామానికి చెందిన ఇసుకపట్ల ప్రసన్న బాబు రైళ్లలో ప్రయాణిస్తూ మహిళల హ్యాండ్ బ్యాగ్‌లో విలువైన వస్తువులను చోరీ చేస్తుండగా అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 3 కాసుల బంగారు పూసల దండ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.51 వేలు ఉంటుందన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ నాగరాణి


పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

భీమవరం: విద్యార్థులు కేవలం విద్యాఅభ్యాసానికే పరిమితం కాకుండా క్రీడలు, కల్చరల్స్ వంటి వివిధ రంగాల్లో రాణించినపుడే ఉన్నత స్థానాల్లో ఉంటారని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం భీమవరం పట్టణంలోని భారతీయ విద్యా భవన్స్ స్కూల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన దేశంలోని విద్యకు ఒక ప్రత్యేకత ఉందని అందువల్ల ఇక్కడ విద్యనభ్యసించిన అనేకమంది ఇతర దేశాల్లో అనేక రంగాల్లో రాణిస్తున్నారన్నారు. భారతీయ విద్యాభవన్స్ స్కూల్ కుల, మతాలకు అతీతంగా చక్కటి వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన స్కూల్ విద్యార్థులను గవర్నర్ సత్కరించారు. ముందుగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ, అద్నాన్ నయీం అస్మి, పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. అలాగే పోలీసు గౌరవవందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, భవన్స్ చైర్మన్ యూకే విశ్వనాథరాజు, అచ్యుతరామరాజు, పోలిశెట్టి సత్యనారాయణ(దాసు) శ్రీనివాసరాజు, ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఆర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

పాలకోడేరు: కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నో కొత్త కొత్త పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని త్రిపుర గవర్నర్ ఎస్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం ఆయన విస్సాకోడేరులో పర్యటించారు. ఈ సందర్భంగా పురిగెళ్ళ రఘురామ్ నివాసాన్ని ఆయన సందర్శించారు. పురిగెళ్ళ రాధాకృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురు మహిళలకు మిషన్లు అందజేశారు అనంతరం ఆయనకు స్థానికులు రఘురామ్ ఆధ్వర్యంలో పౌరసత్కారం నిర్వహించారు. ఆయన వెంట విస్సాకోడేరు గొరగనమూడి సర్పంచులు బొల్లా శ్రీనివాస్, గొట్టుముక్కల శివాజీరాజు ఉన్నారు.

భీమవరంలో వైహెచ్ఏఐ కొరల్ జూబ్లీ వేడుకలు


భీమవరంలో సమావేశమైన వైహెచ్ఏఐ

భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) భీమవరం యూనిట్ కొరల్ జూబ్లీ వేడుకలు డిసెంబర్ 15న నిర్వహించనున్నట్టు యూనిట్ అధ్యక్షుడు మంతెన వెంకట నర్సింహ సీతారామరాజు, కన్వీనర్ గన్నాబత్తుల శ్రీనివాస్ తెలిపారు. శనివారం భీమవరంలో ఏర్పాటుచేసిన కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక త్యాగరాజు భవనంలో నిర్వహించే కొరల్ జూబ్లీ ఉత్సవాలకు జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి 100 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని, వీరికి జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలను పరిచయం చేయడానికి ×లోకల్ టూర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అతిథుల భోజన ఏర్పాట్లకు రూ.2 లక్షలు సీతారామరాజు, వేడుకలు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించే వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, వేడుకల్లో పాల్గొనేవారికోసం ఏర్పాటుచేసే అల్పాహారం వంటివాటికి గన్నాబత్తుల శ్రీనివాస్ ఖర్చు చేయనున్నారని యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ తెలిపారు. సమావేశంలో కత్రేడ్డి సత్యనారాయణ, బోనం పాండురంగరావు, తాళ్లపూడి గాంధీ, కటికరెడ్డి వెంకటరత్నం, సరిపిడకల రామారావు, జానపాటి మధుసూదనరావు, బొండా శ్రీరామ్, నందమూరి రాజేష్, బొండా రాంబాబు, సాగి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

భీమవరం: కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ భీమవరం పట్టణం 28వ వార్డుకు చెందిన గొళ్ల షారూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ శనివారం చెప్పారు. వివరాల ప్రకారం గొళ్ల షారూన్‌కు 2017 అక్టోబర్ 11న కాళ్ల మండలం బొండాలపేటకు చెందిన గొళ్ల కేదారేశ్వరరావుతో వివాహమైంది. వివాహం అనంతరం భర్త, అత్తమామల కోరిక మేరకు రూ.10 లక్షలు కట్నంగా ఇచ్చారు. తరువాత వ్యవసాయ పెట్టుబడికి సొమ్ములు కావాలంటూ అదనపు కట్నం తేవాలంటూ డిమాండ్ చేయడంతో 16 కాసుల బంగారం అమ్మి సొమ్ములు ఇచ్చారు. తరువాత మరొక రూ. 10 లక్షల తేవాలంటూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని షారూన్ ఈ నెల 25న పోలీసులను ఆశ్రయించింది.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

భీమవరం అర్బన్: విద్యుత్ సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపుదలను టీడీపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని బేతపూడి గ్రామ పంచాయతీలోని యమునాపల్లిలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ యూనిట్ రూ.1.90 ఉంటే దానిని సర్దుబాటు, ఇంధన ఛార్జీలు పేరుతోరూ. 2.73 పైసలకు పెంచాలని నిర్ణయించడం సరైనది కాదన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు భవిష్యత్తులో పెంచబోమని హామీ ఇచ్చారని ఇప్పుడు అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు వేలకోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేయడం దారుణమన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో గ్రామాలలో పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ చార్జీలు పెంపెదల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బుంగా కటాక్షరావు, కూచనపల్లి మోషే, భీముడు, రత్నంరాజు, యాకోబు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ


కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర సఫారీ కర్మ చారి ఫైనాన్షియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి ద్వారా ఎన్ఎంఎస్‌టీఈ కార్యక్రమములో భాగంగా భీమవరం మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికులకు కమిషనర్ కె.రామచంద్రారెడ్డి కిట్లు పంపిణీ చేశారు. పురపాలక సంఘం పరిధిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పనులలో పాల్గొనే వారిని గుర్తించి, వారికి పీపీఈ కిట్లు పంపిణీ చేశామని కమిషనర్ తెలిపారు. ఈ వ్యవస్థలో పనిచేసే వారికి మరిన్ని సౌకర్యాలు కలిపించాల్సిన అవసరం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నట్లుగా ఎవరైనా అర్హులు ఉంటే వారు వివరాలను నమోదు చేసుకుని భవిష్యత్తులో ఈ సంస్థ ద్వారా వచ్చే సబ్సిడీలు పొందే అవకాశాన్ని వదులుకోవద్దని తెలిపారు.

ఉండిలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి: ఉండిలో శనివారం సాయంత్రం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహించారు.మండలంలోని వివిధ సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను తెలిపారు. అనంతరం మండలాభివృద్ధికి తన వంతుగా సహకరిస్తానని సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గమహంకాళి, వైస్ ఎంపీపీలు గుత్తుల కనకమహాలక్ష్మి, దత్తాల సుజాతరాణి, ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, తహసీల్దార్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఫెర్రీ బకాయి చెల్లింపునకు అంగీకారం

నరసాపురం రూరల్: గత ఆర్థిక సంవత్సరం మాధవాయిపాలెం ఫెర్రీ పాటదారుడు బకాయి పడిన సొమ్మును మూడు వాయిదాల్లో చెల్లించేందుకు పాటదారుడు అంగీకరించారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జెపీసీ సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న సభ్యులు బకాయి మొత్తం చెల్లించాలని పాటదారుడిని ఆదేశించారు. దీంతో పాటదారుడు ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మూడు వాయిదాల్లో బకాయి సొమ్ము చెల్లించే విధంగా పోస్ట్ పెయిడ్ చెక్కులను మండలపరిషత్ అధికారులకు అందజేశారు.

కొనసాగుతున్న రీ-సర్వే గ్రామ సభలు


పాలకోడేరు: గొల్లలకోడేరులో మాట్లాడుతున్న తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి

పాలకోడేరు: మండల వ్యాప్తంగా జరుగుతున్న రీ సర్వే రెవెన్యూ గ్రామసభ శనివారం గొల్లలకోడేరు గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కుక్కల లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దారు నడింపల్లి భారతి విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ సమస్యలు రీ-సర్వే ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. రీ-సర్వే డీటీ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ ఈ సభ ద్వారా వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సభలో గ్రామస్తుల నుంచి 13 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి కె.రాఘవమూర్తి రాజు, సర్వేయర్ సీహెచ్ శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.

చినకాపవరంలో..

ఆకివీడు: మా కొద్దు బాబోయ్... రీ-సర్వే అంటూ రైతులు, భూమి యజమానులు మొరపెట్టుకుంటున్నారు. మండలంలోని చినకాపవరం గ్రామంలో శనివారం రీ సర్వే గ్రామ సభ జరిగింది. గ్రామ సభలో పలువురు రైతులు మాట్లాడుతూ మా స్వంత భూముల్ని తగ్గించి, ఎక్కువ చేసి మీ ఇష్టానుసారం కొలుస్తున్నారని వారు వాపోయారు. అయితే గ్రామ సభలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, డీటీ ఫరూక్, పాల్గొని రైతుల నుంచి అర్జీలను తీసుకున్నారు. ఈ గ్రామ సభలో 26 ఫిర్యాదులు అందగా, వాటిలో 8 భూమి వ్యత్యాసాలున్నాయని, మరో రెండు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల కోసం, మరో 17 ఎల్‌పీఎంలకు ఫిర్యాదులు అందాయన్నారు.


ఆకివీడు: చినకాపవరం గ్రామంలో రీ-సర్వేని వ్యతిరేకిస్తున్న రైతులు


వీరవాసరం: రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజనేయులు

అండలూరులో..

వీరవాసరం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తెలిపారు. అండలూరులో శనివారం నిర్వహించిన రీ-సర్వే రెవిన్యూ గ్రామసభల్లో పాల్గొని ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలో ఉన్న తప్పులు ఏమైనా ఉంటే సవరించుకునే వెసులుబాటు అందుబాటులో ఉందన్నారు. డీటీ సుబ్బారావు, బొల్లెంపల్లి శ్రీను, ఆర్ఐ వై.రూజ్‌వెల్ట్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 195 మంది ఎంపిక


ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 195 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. శనివారం జరిగిన ఈ జాబ్‌మేళాలో 18 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. మొత్తం 305 మంది విద్యార్థులు పాల్గొనగా 195 మంది ఎంపికయ్యారన్నారు. వీరిలో హెట్రోమోటార్స్ 51, డైకిన్ 30, అపోలో ఫార్మసి 14, నవత ట్రాన్స్‌పోర్ట్ 5, ఇండో ఎంఎం 13, పానసోనిక్ 11, హ్యూందాయ్ 2, ఫాక్స్‌కాన్, ప్రిమియర్ అంజనీ ఫౌండేషన్స్ 45 మంది ఎంపికయ్యారని వివరించారు. వీరిలో 104 మంది విద్యార్థులు తమ కళాశాలకు చెందిన పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీ రంగారావు, కారుమూరి రామలింగేశ్వరరావు, టి.కృష్ణ, కె.భద్రాచలం పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

నరసాపురం: 19 ఏళ్ల యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి చెప్పారు. వివరాల ప్రకారం ఏలూరుజిల్లా మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం గ్రామానికి చెందిన కుంచె నాగలక్ష్మి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ ఓ కళాశాలలో బీకాం చదువుతుంది. అయితే ఈ నెల 21న తల్లితండ్రులు కూతురిని చూసేందుకు నరసాపురం వచ్చి కళాశాలకు, హాస్టల్‌కు వెళ్లారు. కూతురు కనిపించకపోవంతో బంధువులను ఆరా తీశారు. ఆమె సెల్‌ఫోన్ కూడా స్విచాఫ్ చేసి ఉండడంతో పోలీసులను ఆశ్రయించారు.